క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలతో పాటు వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికిస్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

తుంగభద్ర నదికి జలకళ



సంగాల గ్రామం వద్ద నదికి చేరిన నీరు

సి.బెళగల్: తుంగభద్ర నదికి వర్షపు నీరు చేరడంతో జలకళను సంతరించుకుంది. జిల్లాలోని పడమటి ప్రాంతాలతోపాటు నది పరివాహ గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో నదికి వర్షపు నీరు చేరింది. ఇలానే మరికొద్ది రోజులు వర్షాలు కురిస్తే తాగునీటి సమస్యలు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

21న లక్ష్మీ మద్దిలేటిస్వామి కల్యాణోత్సవం

ఓర్వకల్లు: నన్నూరులోని శ్రీలక్ష్మీ సమేత మద్దిలేటి నరసింహస్వామి జయంతి సందర్భంగా ఈ నెల 21వ తేదీ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు. అనంతరం 11.45 గంటలకు శ్రీదేవిభూదేవి సమేత మద్దిలేటి నరసింహ స్వామి కల్యాణోత్సవం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం పుష్పావతి, నాగ ఎర్రమల దంపతులతో పాటు భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవం.. రాత్రి భజన కార్యక్రమం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఆస్పత్రి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. నంద్యాలకు చెందిన మనోహర్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. స్వల్ప గాయాలు కావడంతో బైక్‌పైనే నంద్యాలకు వెళ్లాడు.

భక్తిశ్రద్ధలతో చందన యాత్ర ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శనివారం చందన యాత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులకు చందన, అలంకార, అభిషేకం, సంపూర్ణ నిత్య నైవేద్యం సేవలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు సందేశం ఇచ్చారు. పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో సమస్త మానవాళికి శుభం కలగాలని జగన్నాథ స్వామి వారికి చందన యాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు అర్బన్‌లోని వార్డుల్లో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు సాయిబాబా డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాగు నీటిని పరిశుభ్రం చేయకుండానే వదులుతుండడంతో పసుపు కలర్‌లోకి మారి నీరు సరఫరా అవుతుందన్నారు. ఫలితంగా ప్రజలు తాగడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. మునిసిపల్ అధికారులు నీటిని ఫిల్టర్ చేసి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఖైదీల్లో మార్పు రావాలి

నంద్యాల(వ్యవసాయం): జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల జీవితాల్లో మార్పు రావాలని మూడవ అదనపు జిల్లా జడ్జి మండల లీగల్ సెల్ చైర్మన్ పి.వాసు పేర్కొన్నారు. శనివారం నంద్యాల సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, పరిశుభ్రత, వంట గదులు, ఖైదీల గదులను పరిశీలించి జైలు అధికారులకు పలు సూచనలు చేశారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి

- ఎప్పుడూ ఒకే పంట సాగు చేస్తే నష్టాలు
- చీడపీడల ఉధృతి ఎక్కువే
- పంట మార్పిడితో భూముల్లో సేంద్రియ పదార్థాల వృద్ధి
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు



కర్నూలు అగ్రికల్చర్: ఒకే పొలంలో ఒకే పంటను సాగు చేయడం వల్ల దిగుబడులు తగ్గిపోతాయి. పంటల్లోనూ ఎదుగుదల ఉండదు. చీడపీడల సమస్యలు అధికంగా ఉంటాయి. అందుకే పంట మార్పిడి పాటించాలి. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో పండిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి. సస్య, బ్రమణం (పంట మార్పిడి)తో కలిగే ప్రయోజనాలను వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సాలురెడ్డి వివరించారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చని తెలిపారు. తక్కువ పెట్టుబడితో నేల సారానికి నష్టం కలగకుండా అత్యధిక లాభం పొందవచ్చని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి అవశ్యకతపై సూచనలు ఇచ్చారు.

ఒకేపంట సాగు పద్ధతితో కలిగే నష్టాలు

- వేరు వ్యవస్థ ఒకే లోతుకుపోవడం వల్ల ఆ లోతు వరకే ఉన్న పోషకాలు మాత్రమే వినియోగంలో ఉంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. రైతులపై పెట్టుబడి బారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట కూడా నాణ్యతతో ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. ఇది రైతులకు నష్టం కలిగించే పరిణామం.
- మార్కెటింగ్ సమస్యలు ఎదురవుతాయి. ఒకే పంట సాగు విధానం వల్ల పంట దిగుబడులు తగ్గుతాయి. నాణ్యత ఉండదు. అందువల్ల మార్కెటింగ్ కష్టమవుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతు వేళ్లు ఉన్న పైర్లు, తక్కువ లోతు వేర్లు గల పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. (ఉదా: వరి–అపరాలు, జొన్న–పత్తి)
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి (మొక్కజొన్న–అపరాలు)

పంట మార్పిడితో లాభాలు

- పంట మార్పిడి పద్ధతితో అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరి పంటకు ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రీయ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల సూక్ష్మ జీవులు బాగా వృద్ధి చెందుతాయి.
- వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయా చిక్కుడు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రీయ పదార్థం పెరిగి భూసారం పెరుగుతుంది. పంటలపై వచ్చే కీటకాలు, శిలీంద్రాలు(భూమి ద్వారా వచ్చే శిలీంద్రాలు) జీవిత చక్రాలకు అంతరాయం ఏర్పడి చీడ పీడల ఉధృతి తగ్గుతుంది.
- వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ సాగు వల్ల వాటి వేర్లలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడిపెల రూపంలో అవి ఏర్పడి తర్వాత పండించే పంటకు నత్రజనిని అందిస్తాయి. దీనివల్ల భూసారం పెరుగుతుంది.

మారితే మంచి దిగుబడులు

జిల్లాలో అనేక మంది రైతులు ఏటా ఒకే పంటను సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద ఎప్పుడు వరి తప్ప వేరే పంట సాగు చేయడం లేదు. ఇందువల్ల వరిలో చీడపీడల బెడద ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాలో చాలా వరకు నల్ల రేగడి నేలలను ఖరీఫ్‌లో ఖాళీగా ఉంచుకుని రబీలో శనగ వేస్తున్నారు. శనగ తప్ప వేరే పంటలు వేయడం లేదు. ఇందువల్లనే అనర్థాలు ఏర్పడుతున్నాయి. పంట మార్పిడితో కలిగే ఉపయోగాలు, అనర్థాలపై అవగాహన పెంచుకోవాలి. పంట మార్పిడి వల్ల కలిగే లాభాలను గుర్తించాలి. వచ్చే ఖరీఫ్‌లో పంట మార్పిడి విధానాన్ని పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చు.

రాయితీతో వేరుశనగ విత్తనాలు

కల్లూరు: మండలంలోని రైతులు రాయితీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఖరీఫ్ సిజన్‌లో విత్తుకునేందుకు 40 శాతం రాయితీతో విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

52.4 మీ.మీ వర్షపాతం నమోదు

కల్లూరు మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 52.4 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఖరీఫ్ సిజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ పూజ

పాణ్యం: మండల కేంద్రంలోని వీరనారాయణ స్వామి ఆలయ కుంభాభిషేక పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాతల సహకారంతో తయారు చేసిన కలశాలకు పూజలు చేసి ఆలయ గాలి గోపురంపై ప్రతిష్ఠించారు. పుణ్య జలాలతో అభిషేకించారు.

ఆరాధన ఉత్సవాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం, భజనలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

రేపటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- 21న స్వామి కల్యాణోత్సవం
- 23న రథోత్సవం



ముస్తాబైన చెన్నకేశవస్వామి ఆలయం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవ రెడ్డి, ఈఓ మద్దిలేటి తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు సోమవారం గణపతిపూజ, స్వస్తివాచనం, మృత్సంగ్రహణం, పంచపాలకారాధన, ధ్వజారోహణం, పటాధివాసం, భేరి మృదంగనాథం తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 21వ తేదీ తెల్లవారుజామున 5.20 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, శేష వాహనం, సాయంత్రం హనుమంత వాహన సేవ నిర్వహిస్తామని చెప్పారు. 22వ తేదీ సాయంత్రం ప్రభోత్సవం, గరుడోత్సవం జరగనుందని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ బృందంతో చెక్కన భజనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 23వ తేదీ పూజాదీక్షాహోమం, బలిహరణం పూజ, రథాంగహోమం, సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం.. 24వ తేదీ ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం చూర్ణస్నపనం, పూర్ణాహుతి, సాయంత్రం పార్వేటతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్): నగరంలో ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పెద్దమార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉషూ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా చిన్నారులు ఆసక్తి ఉన్న క్రీడను ఎంచుకొని అందులో రాణించాలన్నారు. సెల్ ఫోన్, టీవీలకు పరిమితం కాకుండా ప్రతి రోజు కొంత సేపు క్రీడలకు సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు, జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

24 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభిక్ వర్గ-2024

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ప్రారంభిక్ వర్గ -2024ను ఈనెల 24, 25, 26 తేదీల్లో ఆదోనిలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘ చాలక్ డాక్టర్ ఎస్.వి.ఎస్. గుప్త తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వ్యాయామం, యోగా, ఆటలు, కథలు తదితర అంశాల ద్వారా శారీరక, మానసిక వికాసానికి, దేశ భక్తిని పెంపొందించేందుకు, జాతీయ భావాలున్న యోగ్యమైన వ్యక్తుల నిర్మాణానికి అఖిల భాతర యోజనలో భాగంగా మూడు రోజుల ప్రారంభిక్ వర్గ జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని ఆయన కోరారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు రూరల్: విత్తన దుకాణాల డీలర్లు విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి హెచ్చరించారు. శనివారం కోడుమూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల డీలర్లతో నిర్వహించిన సమావేశానికి ఏడీఏ సాలురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దుకాణ డీలర్ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నాణ్యమైన విత్తనాలు, మందులను విక్రయించాలన్నారు. రైతులకు అమ్మిన ప్రతి దానికి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. అలాగే దుకాణంలో అమ్మే విత్తనాలు, మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఏవైనా స్టాక్‌కు సంబంధించి రిజిస్టర్ లేకపోతే వాటి అమ్మకాలను నిలిపేయడంతో పాటు దుకాణదారుడిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్‌బీకే సిబ్బందితో సమీక్ష

డీలర్లతో సమావేశం అనంతరం ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్ మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన నిర్ణయాలు, లక్ష్యాలపై చర్చించారు. ఆయా గ్రామాల్లో ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలివ్వాలని ఏడీఏ సూచించారు. గ్రామాల్లో ఎక్కడా లూజ్ విత్తనాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కోడుమూరు మండలానికి 550 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని, ఈనెల 20వ తేదీ నుంచి ఆయా ఆర్‌బీకేల్లో విత్తనాలు అవసరమైన రైతులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈఓ తస్లీమ్ ఉన్నారు.

అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీఎస్‌ఆర్‌టీసీలో పనిచేస్తున్న యూనియన్ రాష్ట్ర నాయకులపై విధించిన అక్రమ సస్పెన్షన్లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుందరరావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంసన్, ఎస్‌ఎంయూ తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావులపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని కోరారు. కాగా, 30వ తేదీన సీఐటీయూ ఆవిర్భావ సదస్సులను విజయవంతం చేయాలని వారు కార్మికులను కోరారు.

కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రభోత్సవం



భక్తజన సందోహం మధ్య స్వామివారి ప్రభోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రభోత్సవం కనులపండువగా సాగింది. స్వామి వారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర రోజును పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించే ఆరాధనోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం స్వామివారి ప్రభోత్సవం నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం భాజాభజంత్రీల మధ్య ప్రభవాహనం వద్దకు చేర్చారు. ప్రభ వాహనానికి విశిష్ట పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తిని వాహనంపై కొలువుంచారు. భక్తుల జయ జయనాదాలు, కరచాల ధ్వనుల మధ్య స్వామివారి ప్రభ వాహనాన్ని ముందుకు కదిలించారు. స్వామి వారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పిల్లల ఆరోగ్య పరిరక్షణలో టీకాల పాత్ర కీలకం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్



పసి పిల్లలకు టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు (టౌన్): తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో టీకాల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఇందిరా గాంధీ నగర్‌లోని 1 వ సచివాలయంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. రక్తహీనతతో బాధపడకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను ప్రతి రోజు తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. అనంతరం సిబ్బంది టీకాలు అందిస్తున్న తీరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగస్వామ్య రెడ్డి, జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు ప్రొఫెసర్‌గా డాక్టర్ జి.మోహన్ రెడ్డి



డాక్టర్ మోహన్‌రెడ్డి అభినందిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు (టౌన్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల గాస్ట్రో ఎంట్రాలజిస్టు విభాగానికి నూతన ప్రొఫెసర్‌గా డాక్టర్ జి.మోహన్ రెడ్డి నియమితులయ్యారు. శనివారం వైద్య విద్యా అడిషనల్ సంచాలకులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి తన చాంబర్‌లో ప్రొఫెసర్‌కు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు విభాగానికి ఇప్పటి వరకు డాక్టర్లు బజరంగ్ ప్రతాప్, కన్నా వెంకటేశ్వర్లు, ఆశా సుబ్బలక్ష్మి, శంకర్‌శర్మ, వెంకటరంగారెడ్డి, జి.మోహన్ రెడ్డితో పాటు ఆరుగురు ప్రొఫెసర్లుగా పనిచేశారన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలందించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఆసుపత్రి మెడికల్ విభాగం వైద్యులు విద్యాసాగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్, డాక్టర్ అర్షియా, డాక్టర్ సందీప్ కుమార్ రెడ్డి, పీజీలు పాల్గొన్నారు.







చిన్న అమ్మవారి శాలలో ప్రత్యేక అలంకారంలో వాసవీ మాత, గీతా మందిరంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు, ఆవోపా సదన్‌లో వాసవీ మాత

ఘనంగా వాసవీ మాత జయంతి



గీతా మందిరంలో పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగరంలోని అమ్మవారి శాలల్లో శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓల్డ్‌సిటీలోని చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, గీతా మందిర్, నిమిషాంబ దేవి, రోజా వీధిలోని ఆవోపా సదన్‌లో వాసవీ జయంతి వేడుకలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అభిషేకం, అర్చన, లలితా సహస్రనామ పారాయణం తదితర విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకం అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆవోపా సదన్‌లో చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి సందేశం ఇచ్చారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: వరుస సెలవులు, వీకెండ్ కావడంతో మహానంది ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని వినాయకనంది, గరుడనంది ఆలయాలతో పాటు నందిసర్కిల్, పెద్ద నంది ప్రాంతాలను సందర్శించారు.

మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. "క్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.